క్లుప్తంగా

పొలాల్లో పచ్చిరొట్ట సాగు



సిద్ధాపురం గ్రామంలో జీలుగ పచ్చిరొట్ట సాగు చేసిన దృశ్యం

ఆకివీడు: పచ్చిరొట్ట సాగుతో చేనుకు చేవ, భూమికి బలం చేకూరుతుందని పలు గ్రామాల్లో రైతులు పచ్చి రొట్ట సాగు చేపట్టారు. రబీ మాసూళ్ల అనంతరం పచ్చిరొట్ట సాగుకు ఆయా వరి చేలల్లో విత్తనాలు వెదజల్లారు. జీలుగ, పిల్లి పెసర విత్తనాలను అధిక శాతం మంది రైతులు సాగు చేశారు. దమ్ము సమయంలో పచ్చిరొట్టను కలిపి దమ్ము చేయడం ద్వారా భూసారం పెరుగుతుందని, భూమిలో పోషకాలు లభిస్తాయని వ్యవసాయాధికారులు చెప్పారు. నైట్రోజన్ సహా సూక్ష్మ మూలకాలు పుష్కలంగా ఉంటాయి. వీటి ద్వారా చేనుకు బలం చేకూరుతుందని వివరించారు. మండలంలోని సిద్ధాపురం, చినమిల్లిపాడు, ఆకివీడు, కుప్పనపూడి గ్రామంలో పలువురు రైతులు పచ్చిరొట్ట సాగు చేశారు.

కల్లు కేంద్రం వద్ద ఘర్షణ

ఆకివీడు: స్థానిక సిద్ధాపురం రోడ్డులోని కల్లు కేంద్రం వద్ద జరిగిన ఘటనలో వ్యక్తి గాయాలు కాగా ఆసుపత్రిలో చేరి వైద్యం పొందుతూ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు మంగళవారం చెప్పారు. స్థానిక జవ్వాది వారి వీధిలో నివసిస్తున్న కోరుమిల్లి సూర్యనారాయణ 9వ తేదీ రాత్రి కేంద్రం వద్దకు వెళ్లగా కేంద్రం నిర్వాహకురాలు సరోజిని మనవడు దుర్గారావు మద్యం మత్తులో పాత బకాయిచెల్లించాలని ఘర్షణపడి కొట్టాడు. దీంతో సూర్యనారాయణకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేరగా అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో 266వ ర్యాంకు



మాదిరెడ్డి ఆదిత్య సాయినాయుడు

భీమవరం: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో భీమవరం పట్టణం గాంధీనగర్‌కు చెందిన మాదిరెడ్డి ఆదిత్య సాయినాయుడు 266వ ర్యాంకు సాధించాడు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్ భీమవరం తిరుమల విద్యా సంస్థల్లో విద్యనభ్యసించిన సాయినాయుడు 10వ తరగతిలో 586, ఇంటర్‌లో 980 మార్కులు సాధించాడు. సాయినాయుడు తండ్రి ప్రసాదరావు మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తుండగా తల్లి సుజాత గృహిణి. ఐఐటీలో విద్యను అభ్యసించాలనేది తన ఆకాంక్ష అని సాయి పేర్కొన్నాడు.

ఏపీ ఈఏపీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ





వేగేశ్న రామ్ చరణ్ వర్మ   కందుల నిర్మల్

కాళ్ల: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో మండలంలోని కోలనపల్లి, పెద అమీరం గ్రామాలకు చెందిన విద్యార్థులు ర్యాంకులు సాధించారు. కోలన పల్లి గ్రామానికి చెందిన వేగేశ్న రామ్ చరణ్ వర్మ ఎంసెట్లో 202 ర్యాంకు సాధించారు. ఎనిమిదో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తిరుమల కాలేజీలో చదివిన రామ్ చరణ్ వర్మ ఐఐటీ సాధించాలని ఉందని తెలిపారు. తండ్రి వెంకట నరసింహారాజు ఆక్వా సాగు చేస్తున్నారు. అలాగే పెద అమిరం గ్రామానికి చెందిన కందుల నిర్మల్ 234 ర్యాంకు సాధించారు. 10వ తరగతి వరకు భాష్యం పబ్లిక్ ప్రైవేట్ స్కూలు ఇంటర్మీడియట్ తిరుమల ప్రైవేట్ కాలేజ్‌లో చదివిన నిర్మల్ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు సాధించాడు. నిర్మల్ తండ్రి నాగేశ్వరరావు వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు.

చురుగ్గా డ్రెయిన్ల పూడికతీత పనులు



మెయిన్‌రోడ్డులో జేసీబీ సాయంతో డ్రెయిన్‌ను బాగు చేస్తున్న సిబ్బంది

నరసాపురం: పట్టణంలో చేపట్టిన డ్రెయిన్స్ పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. వేసవి కావడంతో పట్టణంలో ప్రధాన డ్రెయిన్స్‌లో సిల్ట్ తీసే పనులు వారం రోజుల క్రితం ప్రారంభించారు. అయితే కొన్నిరోజులుగా వర్షాలు పడుతుండటంతో పనుల్లో వేగం పెంచారు. బస్టాండ్ ఏరియా, మెయిన్‌రోడ్డు, స్టీమన్‌రోడ్డు ప్రాంతాల్లో డ్రెయిన్స్‌ను శుభ్రం చేసే పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం మెయిన్ రోడ్డులో ప్రధాన డ్రెయిన్స్‌ను శుభ్రం చేశారు. జేసీబీ సాయంతో పనులు చేస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పనులను పర్యవేక్షించారు. పనులు సకాలంలో పూర్తి చేస్తామని కమిషనర్ చెప్పారు.

మోగనున్న బడి గంట



వేసవి సెలవులకు ముందు బడి నుంచా ఇంటికి ఉత్సాహంగా వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)



పులవర్తి లక్ష్మణస్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- రేపటి నుంచి తెరుచుకోనున్న పాఠశాలలు
- కళకళలాడుతున్న సర్కారు బడులు

ఆకివీడు: వేసవి సెలవులు ముగుస్తున్నాయి. సుమారు నెల రోజుల పాటు విద్యార్థులు అమ్మ ఒడికి పరిమితమై ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఆట పాటలు, అల్లర్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల వారితో ఆనందంగా గడిపారు. అమ్మ ఒడి నుంచి చదువులమ్మ ఒడికి చేరేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. జూన్ 13 నుంచి తెరువనున్న బడులకు వెళ్లేందుకు ప్రతి విద్యార్థీ ఉత్సాహంగా ఉన్నాడు. ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల భవనాలను శుభ్రం చేస్తున్నారు. ప్రాంగణంలోని చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. పండుగ వాతావరణంలో సర్కారు బడులు తెరిచేందుకు సన్నద్ధమవుతున్నాయి. సర్కారు బడులు కళకళలాడుతున్నాయి.

నియోజకవర్గంలో 226 సర్కారు బడులు

ఉండి నియోజకవర్గంలోని ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు మండలాల్లోని పలు గ్రామాల్లో 226 ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 19,205 మంది విద్యార్థులు విద్యాభ్యాసం పొందేందుకు సిద్ధంగా ఉన్నారు. బడులు తెరిచిన తరువాత కొత్తగా చేరే విద్యార్థులు, ఒకటవ తరగతిలో చేరే విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొత్త విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు.

వసతులు, విద్యార్థులు ఫుల్

కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే విధంగా ప్రభుత్వ పాఠశాలలున్నాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతులు మెరుగయ్యాయి. ఆధునిక విద్యాభ్యాసం కొనసాగించడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం చేరుతున్నారు. పాఠశాలల్లో నూతనంగా ఏర్పాటు చేసిన బల్లలు, డ్యూయల్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, డిజిటల్ బోర్డులు, ఐఎఫ్‌పీ ప్యానల్స్, ట్యాబ్‌లతో పాటు విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనీఫాంలు, షూ, టై, బెల్టులు అందజేస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులు చేరేందుకు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీటు పొందే అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉపకార వేతనాలకు 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

నియోజకవర్గంలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

మండలం	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
ఆకివీడు	52	4,539
కాళ్ల	60	4,994
ఉండి	59	5,212
పాలకోడేరు	55	4,460
మొత్తం	226	19,205

మలేరియాను నిర్మూలిద్దాం



కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి మలేరియా ప్రబల కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాళ్ల ప్రభుత్వాసుపత్రి వైద్యులు సరాబు సునీల్ తెలిపారు. మండల కేంద్రమైన కాళ్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మలేరియా మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ దోమల లార్వాను నిర్మూలించాలని సూచించారు. ఇంటి ఆవరణలో పనికిరాని వస్తువులు టైర్లు లాంటివి ఉంటే తొలగించాలని పేర్కొన్నారు. ఇంటి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకుని నీరు నిల్వ లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరికైనా జ్వరం లక్షణాలు ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలని తెలియజేశారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా లాంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అందువల్ల ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్లు చేయాలని స్పష్టం చేశారు. మూడు రోజులు పైబడి చలితో కూడిన జ్వరం ఉంటే వైద్యం సంప్రదించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు విజయావతి, చండీరాణి, పాల్సన్, సుబ్బలక్ష్మి, పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు జోరుగా వ్యాక్సినేషన్



కేపీ పాలెంలో పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ డాక్టర్ జి.నీలిమ

మొగల్తూరు: వర్షాకాలంలో వాతావరణ మార్పులు కారణంగా పశువులకు వచ్చే వివిధ రకాల వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైనదని మొగల్తూరు వెటర్నరీ డాక్టర్ జి.నీలిమ తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడంతో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం మండలంలోని కేపీ పాలెం గ్రామంలోని పశువులకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో సుమారు 10 వేల పశువులు ఉండగా ఇప్పటి వరకు మూడువేల పశువులకు వ్యాక్సిన్ వేశామన్నారు. పశువులకు ప్రాణాపాయం లేకుండా రైతులు ముందు జాగ్రత్తగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ వేయించేందుకు రైతులు ముందుకు రావాలన్నారు. పశువైద్య శాఖ సిబ్బంది కూడా గ్రామాల్లోని పశువులను పరీక్షించి టీకాలు వేస్తారన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌ను వినియోగించుకోవాలి



రామన్నపాలెంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఒ.దినేష్ కోరారు. మండలంలోని రామన్నపాలెం 2 సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్యామిలీ ఫిజీషియన్ శిబిరం ద్వారా రోగులను పరీక్షించడం ద్వారా వెంటనే రోగులకు వైద్య సేవలు అందించవచ్చున్నారు. గ్రామంలోని బాలింతలను, గర్భిణులను, కిశోర బాలికలను, లేవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా సచివాలయానికి వచ్చిన వారితో పాటు గ్రామంలోని రోగులను సుమారు 162 మందిని పరీక్షించి మందులను అందించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె.స్వర్ణలత, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు రేవతి, మరియమ్మ, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన



భక్తులకు ప్రసాదాలు వడ్డిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని గాంధీబొమ్మల సెంటర్‌లో ఉన్న శ్రీ దాసాంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ కమిటీ సభ్యుడు మేకా శేషుబాబు పాల్గొని భక్తులకు ప్రసాదాలు వడ్డించారు. అర్చకులు వేద ఆశీర్వచనాలు అందజేసి స్వామివారి శేష వస్త్రాలతో శేషుబాబుని సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవనం సాగించడం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వెలివెల మాజీ సర్పంచ్ కెల్లా సింహాచలం, దేవరపల్లి సత్తిబాబు, దేశంశెట్టి రాము తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన శిబిరంలో హాజరైన 26 మందికి డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేశారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వైద్యసలహాలు అందజేశారు. పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సజ్జాపురం శాఖ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కార్యదర్శి కోసూరి గాంధీ, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, సీఎస్ సాధు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి



పెన్నాడలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.అశ్రియతో కలసి పరిశీలించారు. బి.బలరాం ఉపాధి కూలీలకు ఎదురవుతున్న సమస్యలపై ఉపాధి పనులు ఏవిదంగా జరుగుతున్నాయనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. బలరాం మాట్లాడుతూ ఉపాధి హామీ చట్ట ప్రకారం 100 రోజులు పని కల్పించాలి కానీ అన్ని రోజులు పనులు కల్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. హమీశలకైతే మూడు లేక నాలుగు వారాలు మాత్రమే పనులు కల్పిస్తున్నారని అన్నారు. భారీ యంత్రాలు వచ్చేయడంతో వ్యవసాయ కూలీలకు పని దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్సులు, పని ప్రదేశాల్లో ఎండ తీవ్రత బారిన పడకుండా ఉపాధి కూలీలకు టెంట్లు చల్లని త్రాగునీరు, మజ్జిగ అందించాలన్నారు. కానీ ఇవేమి అమలు కావడం లేదని కూలీలు వాపోయారు. ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలన్నారు. అనుకోని ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్స నిమిత్తం ఏర్పాట్లు చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక జీవనమే ముక్తికి మార్గం



మాతా ఓం శ్రీని సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: ఆధ్యాత్మిక జీవనం సాగించడం ద్వారానే మనిషికి ముక్తిమార్గం లభిస్తుందని మార్కండేయ తపోవనం (పెనుమంట్ర) ప్రవచన కర్త మాతా ఓం శ్రీ అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు రామాలయం వద్ద మంగళవారం మాతా ఓం శ్రీ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రామాయణ, మహాభారతంలోని పలు అంశాలను వివరించారు. త్వరలో రామాలయం వద్ద 9 రోజుల పాటు రామాయణం లోని పలు అంశాలను వివరించడానికి కమిటీ అనుమతి కోరినట్లు మాతా ఓం శ్రీ వివరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాతా ఓం శ్రీని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్‌వీ రత్నారావు, బి.గోపాలకృష్ణంరాజు, పి.అచ్యుతరామ్,కె.జయభారతరెడ్డి పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం బయట బిక్షాటన చేసుకుని జీవిస్తున్న ఓ వృద్ధురాలి మృతి చెందడంతో పట్టణ అమ్మ చారిటబుల్ ఫౌండేషన్ సభ్యులు ఆమె అంత్యక్రియలు చేశారు. మంగళవారం ఫౌండేషన్ సభ్యులు అంబటి సాయి తేజ మాట్లాడుతూ ఆలయం వద్ద బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే ఓ వృద్ధురాలు గుడి వెనుక ఉన్న ఓ పూరిపాకలో నివాసం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆ వృద్ధురాలు మృతి చెందిన విషయం స్థానికులు తమ ఫౌండేషన్‌కు తెలియజేశారు. ఆమెకు తన అనేవాళ్లు ఎవరూ లేకపోవడంతో రాత్రి ఆ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఫ్రీజర్‌లో పెట్టారని, మంగళవారం ఉదయం దాతల సహకారంతో అంబులెన్స్ ద్వారా పట్టణ శ్మశాన వాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సతీష్, యశ్వంత్, సిద్ధిక్, చందు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రైవేట్ విద్యా సంస్థలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్టులు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని తాడేపల్లిగూడెం జోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా) సభ్యులు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి హనుమను కలిసి వినతిపత్రం సమర్పించారు. అపుస్మా జోన్ అధ్యక్షుడు వాకలపూడి రామకృష్ణ మాట్లాడుతూ టాలెంట్ టెస్టులు నిర్వహించడం చట్ట విరుద్ధమని, అటువంటి వాటికి ఎటువంటి అనుమతి ఉండదని, తల్లిదండ్రులు విషయాన్ని గమనించాలని కోరారు. టెస్టులు నిర్వహిస్తే అపుస్మాకు గాని, విద్యాశాఖ అధికారులకు గాని ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి పచ్చిపాల శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా

పాలకొల్లు అర్బన్: ఏపీ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఈరంకి కాశీ విశ్వనాథం రాజీనామా చేశారు. ఈ మేరకు కార్పొరేషన్ ఉన్నతాధికారులకు తన రాజీనామా లేఖను మంగళవారం అందజేసినట్లు ఆయన స్థానిక విలేకరులకు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలకొల్లులో బ్రాహ్మణ సామాజిక వర్గానికి ఉన్నత పదవులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కట్టబెట్టి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో డైరెక్టర్ పదవి, అలాగే పట్టణంలోని మూడు ఆలయాలకు ముగ్గురు ట్రస్ట్‌బోర్డు సభ్యులను నియమించారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పరాజయం పాలవడంపై నైతిక బాధ్యత వహించి పదవికి రాజీనామా చేసినట్లు కాశీ విశ్వనాథం విలేకరులకు తెలిపారు.

అంగన్‌వాడీల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పనిసరిగా పంపించాలని తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి బి ప్రమోదకుమారి కోరారు. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రీస్కూల్ నుంచి ప్రైమరీ స్కూల్‌కు ప్రమోట్ అయ్యే విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంచిలి సెక్టార్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఉండి: అధికారం చేపట్టబోతున్న కొత్త ప్రభుత్వం ఆక్వా రైతులకు రైతు భరోసా, రాయితీపై విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించి ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్ కోరారు.ఆ క్వా రైతులతో నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఉండిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆక్వా రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారిని ఆదుకునేందుకు కొత్త ప్రభుత్వం అన్ని విధాల వారికి సహకరించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు .లక్షల కోట్లు విదేశీమారక ద్రవ్యాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తున్న ఆక్వా రంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించి వారికి సబ్సిడీలు అందించాలని అన్నారు. నాణ్యమైన సీడ్, ఫీడ్ అందిస్తూ సీడ్, ఫీడ్ ధరలను తగ్గించి ఆక్వా చిన్న,సన్నకారు రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆక్వా రైతులు పడమట ఆంజనేయులు, బొర్రా త్రిమూర్తులు, ఎన్.శ్రీనివాస్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు అన్న క్యాంటిన్ ప్రారంభం

ఆకివీడు: స్థానిక దొరగారి చెరువు గట్టు వద్ద అన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు మోటుపల్లి రామ వర ప్రసాద్ చెప్పారు. మంగళవారం ఆ ప్రాంతాన్ని కూటమి నాయకులు సందర్శించి క్యాంటిన్ ఏర్పాట్లపై చర్చించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొట్టుముక్క వెంకట సుబ్బరాజు కుమారుల ఆర్థిక సహకారంతో క్యాంటిన్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు.గొట్టుముక్కల వెంకట సత్యనారాయణరాజు, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, గంధం ఉమ, శింగులూరి చిట్టిబాబు, పిల్ల నర్సింహరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: పట్టణంలో రాజరాజేశ్వరి థియేటర్‌కు వెళ్లే దారిలో మలుపులో ఉన్న డ్రెయిన్ ప్రమాదకరంగా ఉంది. డ్రెయిన్‌పై మూతలు సవ్యంగా లేవు. సరిగ్గా మలుపులో గొయ్యిగా ఉండటంతో అటుగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. పలు సినిమాహాళ్లు, ఆస్పత్రులు ఇటువైపు ఉంటడంతో నిత్యం వందల మంది ఇటుగా ప్రయాణిస్తుంటారు. వారంతా భయపడుతూ అడుగులు వేయాల్సిన పరిస్థితి. మున్సిపల్ అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్రమంత్రి శ్రీనివాసవర్మను కలిసిన నాయకులు



కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

పాలకొల్లు సెంట్రల్: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన పట్టణ బీజేపీ నాయకులు విలేకరులకు తెలిపారు. మంగళవారం భీమవరంలో మంత్రి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీలో కష్టపడి క్రమశిక్షణతో పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని దీనికి కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఉదాహరణ అని అన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కొల్లి కొండప్రసాద్, ట్రెజరర్ కొణిజేటి గుప్తులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో ఎంటీయూ 1318 వాడాలి

యలమంచిలి: రైతులు ఖరీఫ్ పంటకు ఎంటీయూ 1318 వరి వంగడాన్ని ఊడ్చుకోవాలని మండల వ్యవసాయాధికారి శింగులూరి దేవి కోరారు. కొత్తగా వచ్చిన ఈ వరి వంగడం తుఫాన్‌లు, వరదల సమయంలో తల వాల్చకుండా నిలబడి ఉంటుందని ఆమె చెప్పారు. అయితే ఈ వంగడానికి నత్రజని (యూరియా) తక్కువగా వాడాలని ఆమె సూచించారు. 140 నుంచి 145 రోజుల్లో కోతకు వస్తుందని, యూరియా తక్కువగా వాడితే మరింత ముందుగా కోతకు వస్తుందన్నారు. ఈ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.